క్లుప్తంగా

మంత్రి కేటీఆర్‌ని కలిసిన ఎమ్మెల్యే భగత్



మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే భగత్

హాలియా: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భగత్ నాగార్జునసాగర్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిఅయ్యే విధంగా చూడాలని కోరుతూ మంత్రి కేటీఆర్‌కి వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ధాన్యం లోడ్ డీసీఎం బోల్తా



రోడ్డుపై చెల్లాచెదురుగా ధాన్యం బస్తాలు

నిడమనూరు: మండలంలోని వెంకటనగర్ వద్ద బుధవారం రాత్రి ధాన్యం లోడ్‌తో వెళ్తున్న డీసీఎం బోల్తా పడింది. నిడమనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను లోడ్ వేసుకుని హాలియా వైపు వెళ్తుండగా బ్రేక్ పట్టేయడంతో లారీ బోల్తా పడినట్లు తెలిసింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. రోడ్డుపై ధాన్యం బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం



జోడో యాత్రలో పాల్గొన్న బీఎల్‌ఆర్

మిర్యాలగూడ అర్బన్: గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నాయకుడు బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్‌ఆర్) అన్నారు. బుధవారం మండలంలోని జాలుబాయితండా, రాయినిపాలెం, ముల్కలకాల్వ గ్రామాలల్లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, నాయకులు కోటేష్, పద్మాలాల్, కాకునూరి బసవయ్యగౌడ్, వెంకటేష్, మోహన్‌రెడ్డి, శ్రీను, కుర్ర వెంకన్న, జాని, గురువయ్య తదితరులున్నారు.

జానారెడ్డి పరామర్శ



ధనమల్లయ్య ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న మాజీ మంత్రి జానారెడ్డి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మాజీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గార్లపాటి ధనమల్లయ్య ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీలో నివాసముంటున్న ధనమల్లయ్య ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. జానారెడ్డి వెంట డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కర్నాటి లింగారెడ్డి, చిరుమర్రి కృష్ణయ్య, పొదిల శ్రీనివాస్, ఎంఏ సలీం, పొదిల వెంకన్న, రవీందర్‌రెడ్డి, ఆవుల బక్కారెడ్డి తదితరులున్నారు.

బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కుందూరు జైవీర్‌రెడ్డి

హాలియా: అంబేడ్కర్ జయంతి సందర్భంగా కుందూరు రఘువీర్ యూత్ ఆధ్వర్యంలో అనుముల గ్రామంలో గత 5 రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, హాలియా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, కౌన్సిలర్లు పిల్లి చంద్రకళ, తక్కెళ్ళపల్లి యల్లమ్మ, దేపావత్ ప్రసాద్ నాయక్, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జూపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగులో కక్కుర్తి

- సిబ్బంది భోజనాల కోసం ఒక్కో టీంకు రూ.1500 ఇస్తున్న ప్రభుత్వం
- అయినప్పటికీ గ్రామాల్లో ప్రజాప్రతినిధులే భోజనాలు సమకూరుస్తున్న వైనం
- డబ్బులు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కాజేస్తున్నారని సిబ్బంది ఆరోపణ
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. ప్రజలకు కంటి పరీక్షలు చేసేందుకు గాను ప్రతి టీంలో 10మంది సిబ్బంది ఉండేలా జిల్లా వైద్యాధికారులు టీంలను ఏర్పాటు చేశారు. ఒక్కో టీంకు ప్రభుత్వం తరఫున భోజనాల కోసం రూ.1500 చెల్లిస్తుండటంతో పాటు కంటి పరీక్షల కోసం వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు టెంట్ ఏర్పాటు కోసం రోజుకు మరో రూ.1000 ఇస్తోంది. కాగా వైద్య శాఖ ఉన్నతాధికారులు తమకు కనీసం భోజనాలు ఏర్పాటు చేయడం లేదని కంటి వెలుగు సిబ్బంది వాపోతున్నారు.

మిర్యాలగూడ డివిజన్‌లో 24 టీంలు..

మిర్యాలగూడ డివిజన్ పరిధిలో కంటి పరీక్షల కోసం మొత్తం 24టీంలను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం అధికారులు ఏర్పాటు చేశారు. వీరికి భోజనాల కోసం రోజుకు రూ.36వేలు ప్రభుత్వం విడుదల చేస్తుంది. కానీ డివిజన్ పరిధిలో దాదాపు అన్ని గ్రామాల్లో అధికార పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలే ఉండటంతో కంటి పరీక్షలు చేసేందుకు వచ్చే వైద్య సిబ్బందిని ప్రభుత్వ ప్రతినిధులుగా భావించి భోజనాలు ఏర్పాటు చేసి ఆతిథ్యం ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వం భోజనాల కోసం నిధులు విడుదల చేస్తుందనే విషయం కూడా వారికి తెలియకుండా జాగ్రత్తలు పడుతున్న వైద్య శాఖ ఉన్నతాధికారులు ఆ మొత్తం నిధులను కాజేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సామాజిక మాధ్యమాల్లో వైరల్..

తమ భోజనాల కోసం ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను డిప్యూటీ డీఎంహెచ్‌ఓతో పాటు మరో ఇద్దరు అధికారులు కాజేస్తున్నారని ఆరోపిస్తూ కంటి పరీక్షలు చేసే వైద్యుడు సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో అప్రమత్తమైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయ అధికారులు తామే భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని, అవి బాగానే ఉన్నాయని వైద్య సిబ్బంది అందరితో రాయించుకున్నట్లు సమాచారం. సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేసిన సదరు ఉద్యోగిని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేశా రవిని వివరణ కోరగా.. ప్రతి రోజు వైద్య సిబ్బందికి తామే భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తనపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు.

కక్ష సాధిస్తున్నారు



కంటి వెలుగు సిబ్బందికి భోజనాలు పెట్టడం లేదనే విషయాన్ని వెలుగులోకి తెచ్చినందుకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. భోజనాలు అందక సిబ్బంది పడుతున్న బాధలను చూడలేక డిప్యూటీ డీఎంహెచ్‌ఓను అడిగినా పట్టించుకోలేదు. గత్యంతరం లేక సోషల్ మీడియాలో పోస్టు పెట్టాను. దీంతో వైద్య సిబ్బందిని బెదిరించి భోజనాలు తామే ఏర్పాటు చేస్తున్నామని వారితో రాయించుకుని నన్ను సస్పెండ్ చేస్తున్నట్లు నోటీసు ఇచ్చారు.నేను నోటీసు తీసుకోకపోవడంతో నాపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

– కొండబోయిన వెంకన్న, కంటి పరీక్షల సహాయకుడు

భోజనాలు ఏర్పాటు చేస్తున్నాం



కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేసేందుకు గాను మా గ్రామంలో కంటి పరీక్షలు చేసే వైద్య సిబ్బందికి మా సొంత ఖర్చుతో భోజనాలు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ పథకం కాబట్టి మా గ్రామస్తులందరికీ కంటి పరీక్షలు చేయించాలనే ఉద్దేశంతోనే భోజనాలు ఏర్పాటు చేస్తున్నాం.

– అమరావతి సైదులు, ఎంపీటీసీ సభ్యుడు, తడకమళ్ల

బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



దేవరకొండ: ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి: బీఆర్‌ఎస్ హయాంలోనే రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధి చెందాయని పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. మన ఊరు–మన ప్రభుత్వం–మన పథకాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని అజ్మాపురం గ్రామంలో రూ.60 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని కొట్టాలగడ్డ గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, సర్పంచ్ ఆదిరాల నగేష్, ఎంపీటీసీ గుండాల నాగమణిశ్రీనివాస్, చందూనాయక్, సిరసువాడ శ్రీను, అర్వపల్లి నర్సింహ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి..

దేవరకొండ: మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ తోఫాను ఆయన ముస్లింలకు పంపిణీ చేశారు. అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, శిరందాసు కృష్ణయ్య, టీవీఎన్ రెడ్డి, వేముల రాజు, ముస్లిం మత పెద్దలు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని మసీదులో రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ సందర్భంగా అందజేస్తున్న రంజాన్ తోఫాలను 175 మంది ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌గౌడ్, పస్నూరి యుగేందర్‌రెడ్డి, కేసాని లింగారెడ్డి, గంధం సురేష్, కొడిదాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



మిర్యాలగూడ టౌన్: స్వర్ణలతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు

మిర్యాలగూడ టౌన్: తెలంగాణలో దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎంతో కృషిచేస్తున్నారని మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు అన్నారు. ఇటీవల అంబేడ్కర్ జయంతి సందర్భంగా దళిత రత్న అవార్డు అందుకున్న త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారం గ్రామానికి చెందిన మాలమహానాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు అంగరాజు స్వర్ణలతను బుధవారం మిర్యాలగూడలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి, కౌన్సిలర్ వంగాల నిరంజన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ పత్తిపాటి నవాబు, బీఆర్‌ఎస్ నాయకుడు అన్నభీమోజు నాగార్జునచారి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

మిర్యాలగూడ: పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన 70మంది ఎమ్మెల్యే భాస్కర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో వేములపల్లి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ, సర్పంచ్ దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సంద్యాల శ్రీరాంరెడ్డి, ఉపసర్పంచ్ తరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏపీడీ శైలజ

దేవరకొండ: ఉపాధి హామీ పథకంలో భాగంగా 2019 నుంచి 2023మార్చి వరకు దేవరకొండ మండల పరిధిలోని 39 గ్రామపంచాయితీల్లో రూ.23కోట్లతో నిర్వహించిన పనులకు సంబంధించి చేపట్టిన 12వ విడత సామాజిక తనిఖీ బుధవారం ముగిసింది. దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రారంభమైన ఈ సామాజిక తనిఖీ బుధవారం పొద్దుపోయే వరకు కొనసాగింది. రెండో రోజు ఏపీడీ శైలజ సామాజిక తనిఖీలో పాల్గొన్నారు. కాగా మంగళవారం 12గ్రామపంచాయతీల రికార్డులు తనిఖీ చేయగా, బుధవారం మిగిలిన 27పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులు, కూలి చెల్లింపులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లను పనులు, ఖర్చు, వసతులు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శర్మ, అంబుడ్స్‌మన్ గోరి, నిరంజన్, ఎంపీఓ సీవీఎన్ రావు, ఏపీఓ రాంచంద్రయ్య, ఏఆర్‌పీ రమేశ్ తదితరులున్నారు.

వినతిపత్రం అందజేత

ఈ సందర్భంగా ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కంబాలపల్లి ఆనంద్ ఏపీడీ శైలజకు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని వారాలుగా ఉపాధి కూలీలకు డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.600 ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని ఆయన వినతిపత్రంలో కోరారు.

ప్రజాస్వామ్య మనుగడకు రాజ్యాంగమే వెన్నెముక



మాట్లాడుతున్న చొల్లేటి ప్రభాకర్

వేములపల్లి: దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగమే వెన్నెముక అని మాజీ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో రాజ్యాంగ పత్రాలను పంపిణీ చేసి, భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల సమన్వయం ఎలా ఉండాలో తెలిపేదే భారత రాజ్యాంగమన్నారు. ప్రజాస్వామ్యం పాలకుల చేతిలో బందీగా మారిందని, ప్రజాస్వామ్యంలో ప్రజల పాలన రావాలని అందుకై ప్రజల్లో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, ప్రజాస్వామ్య పరిరక్షణ సేవా సమితి చైర్మన్ పాశం సురేందర్‌రెడ్డి, సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



త్రిపురారం: కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

త్రిపురారం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకోవడానికి వచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని, నిబంధనల ప్రకారం కాంటా వేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలలో తాగునీరు, టెంటు తదితర వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను సూచించారు. ధాన్యాన్ని సక్రమంగా తూకాలు వేసి వెంటనే కేటాయించిన మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. ఆయన వెంట పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, త్రిపురారం తహసీల్దార్ కేసీ ప్రమీల తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు సెంటర్ల తనిఖీ..

నిడమనూరు: నిడమనూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లు, కాంటాలు, ధాన్యం బస్తాల ఎగుమతి తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచాలి

మాడుగులపల్లి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మిర్యాలగూడ ఇన్‌చార్జి ఆర్డీఓ ఎం. జయచంద్రారెడ్డి సూచించారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశంకర్, ఆర్‌ఐ అక్తర్‌అలీ, ఏడీఓ నాగమణి, ఏఓ సైదానాయక్, ఏఈఓ దేవ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్



ఇబ్రహీంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. కొత్తపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రిక్కల మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు యడవెల్లి అనుపమానరేందర్‌రెడ్డి, నల్లబోతు వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, కోఆప్షన్ సభ్యుడు చాపల సైదులు, డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే భగత్, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ అన్నారు. బుధవారం హాలియా పట్టణంలోని లక్ష్మీనర్సింహ గార్డెన్స్‌లో ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ఇఫ్తార్ విందులో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం ముస్లింలకు తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ శంకరయ్య, ఎంపీపీ బొల్లం జయమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, నిడమనూరు జెడ్పీటీసీ నందికొండ రామేశ్వరీ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్ణ బ్రహ్మారెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు, ముస్లింలు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆచూకీ పట్టించుకోకపోవడం సరికాదు



మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌యూఐ నాయకులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని మినా ఇంజినీరింగ్ కళాశాలలో ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని ఆచూకీ రెండు రోజులుగా తెలియకపోయినప్పటికీ కళాశాల యాజమాన్యం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోందని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్ అన్నారు. బుధవారం విద్యార్థిని వివరాలను అడిగేందుకు కళాశాలకు వస్తే యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని, ఈ విషయంపై త్వరలోనే జేఎన్‌టీయూ, ఐఏసీటీఈకి ఫిర్యాదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు నినావత్ సిపాయినాయక్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సురేష్, దినేష్, శివ, సందీప్, రమేష్, రాకేష్, అవినాష్ తదితరులున్నారు.

కళాశాలకు సంబంధం లేదు..

మిర్యాలగూడ: విద్యార్థిని అదృశ్యంపై కళాశాలకు ఎలాంటి సంబంధం లేదని మినా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మహమ్మద్ అలీ తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం సదరు విద్యార్థిని కళాశాల నుంచి ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిందని, ఎంతకు ఇంటికి రాకపోవడంతో విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆమె ఆచూకీ కనుక్కొన్నారని తెలిపారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులను పిలిపించి విద్యార్థినికి కౌన్సిలింగ్ ఇవ్వగా.. తాను మేజర్ అని, తన ఇష్ట ప్రకారం పెళ్లికి అంగీకరించినట్లు తెలిపారు. విద్యార్థిని అదృశ్యం విషయమై కళాశాల యాజమాన్యంపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు.

చిత్రలేఖనంలో ఉత్తమ ప్రతిభ

మిర్యాలగూడ టౌన్: ఇటీవల రంగోత్సవ్ సెలబ్రేషన్, ముంబై వారు నిర్వహించిన జాతీయ స్థాయి కలర్ కాంటెస్ట్–2023లో పట్టణంలోని శాస్త్ర స్కూల్ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాశం శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దశరథ మోహనకృష్ణ, ఇన్‌చార్జి సింధు తెలిపారు. పాఠశాలకు చెందిన నంద్యాల వేదశ్రీ, సాత్విక, బి. శ్రీనిధి, ఆర్. సాత్విక, శృతి కీర్తనతో పాటు మరో 15 మంది విద్యార్థులు పాల్గొని పలు పతకాలు, అవార్డులు సాధించినట్లు డ్రాయింగ్ మాస్టర్ యినుగుర్తి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు.

దివ్యాంగులకు సేవ చేయడం గొప్ప వరం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



మానసిక దివ్యాంగులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి తదితరులు

హాలియా: మానసిక దివ్యాంగులు, అనాథలకు సేవ చేయడం గొప్ప వరమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. పట్టణంలోని అక్షర కిరణం మానసిక వికలాంగుల ఆనంద నిలయంలో మంగళవారం రాత్రి జరిగిన ప్రథమ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అక్షర కిరణం మానసిక వికలాంగుల ఆనంద నిలయం నిర్వాహకుడు మేదరి కిరణ్‌ను అభినందించారు. అక్షర కిరణం మానసిక వికలాంగుల నిలయానికి తన సహకారం ఉంటుందన్నారు. అనంతరం మానసిక దివ్యాంగులు, మేదరి కిరణ్‌ను ఎమ్మెల్సీ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ, ఎంపీపీ పేర్ల సుమతి, జిల్లా కౌన్సిలర్ల ఫోరం అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి, వికలాంగుల సంఘం నాయకుడు శ్రీనివాస్, ఉపాధ్యాయుడు షర్ఫొద్దీన్, బీఆర్‌ఎస్ నేతలు చల్లా మట్టారెడ్డి, మాతంగి కాశయ్య, మహిళ నాయకురాలు కంపసాటి గంగాభవాని, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొందూరి శోభన్‌బాబు, హజారిగూడెం ఉప సర్పంచ్ జబీన్ జలీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



మిర్యాలగూడ టౌన్: ముత్తిరెడ్డికుంటలో రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న నలమోతు సిద్దార్థ

మిర్యాలగూడ టౌన్: రంజాన్ పండుగను పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని 19వ వార్డు ముత్తిరెడ్డికుంటలో ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నలమోతు సిద్దార్థ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పత్తిపాటి సంజాత, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర కోటేశ్వర్‌రావు, పట్టణ బీఆర్‌ఎస్ కార్యదర్శి పెద్ది శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి: ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నలమోతు సిద్దార్థ ఆధ్వర్యంలో బుధవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్, మాజీ ఎంపీపీ కూరాకుల మంగమ్మ, సర్పంచ్ కొత్త మర్రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే బాబ్జాన్, ఎంపీటీసీ పేర్ల లింగయ్య, టీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు బండి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండల కేంద్రంలోని ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం 50 ముస్లిం కుటుంబాలకు దేవేందర్ యువసేన ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్, నట్వ గిరిధర్, వందనపు ఆంజనేయులు తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

సొంత ఖర్చులతో పంపు సెట్ ఏర్పాటు

కొండమల్లేపల్లి: మండలంలోని గుమ్మడవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దేవరోనితండావాసులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఎంపీపీ దూదిపాల రేఖ సొంత ఖర్చులతో బుధవారం పంప్‌సెట్ ఏర్పాటు చేయించారు. తండావాసులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్ రమావత్ రాకేశ్‌నాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నిడమనూరు: మండల పరిధిలోని రాజన్నగూడెంలో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ కాల్వల నిర్మాణ పనులను బుధవారం ఎంపీపీ బొల్లం జయమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముంగి జ్యోతిశివమారయ్య, ఎంపీటీసీ మజ్జిగపు లక్ష్మీవెంకటరెడ్డి, మండలి చిన లింగయ్య తదితరులున్నారు.

బీఎల్‌ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

మిర్యాలగూడ: పట్టణంలోని మస్జీద్ అరాఫత్‌లో బుధవారం బీఎల్‌ఆర్ బ్రదర్స్ ఆధ్వరలో ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలు, బీఎల్‌ఆర్ తనయుడు ప్రసన్నకుమార్‌రెడ్డి, మౌలాన మగ్దూం, అహ్మద్ చావుష్, షఫీజ్ ఉద్దీన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఎన్నిక

పెద్దఅడిశర్లపల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఏపీ రెడ్డి నివాసంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కేశంనేనిపల్లి గ్రామ శాఖను ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా రాంమూర్తి, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌నాయక్, ఉపాధ్యక్షులుగా భత్య, సహాయ కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా తిరుపతి, కమిటీ సభ్యులుగా మోతీలాల్, జగన్, రవి, బిక్కు, సీతారాం, రాము, శ్రీను, జైహిందర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్యయాదవ్ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

మాడుగులపల్లి: మండలంలోని సీత్యాతండాకు చెందిన రమావత్ జాన్ హమాలీ పనిచేస్తూ మంగళవారం వడదెబ్బతో మృతిచెందాడు. సల్కునూరు పీఏసీఎస్ చైర్మన్ స్వూరధర్‌రెడ్డి బుధవారం జాన్ మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.20వేలు అందజేశారు. అంతకుముందు మృతుడి కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకుడు స్కైలాబ్ నాయక్ పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, సర్పంచులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

దేవరకొండ: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ అగ్నిమాపక శాఖ అధికారి రాజునాయక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర సినిమా థియేటర్‌లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది ఫయాజ్‌ఖాన్, మధు, నిరంజన్, నవీన్, చందులాల్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ చాంబర్స్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రయాణికులు పాల్గొని తమ సలహాలు, సూచనలు తెలియజేశారు. గ్రామాలకు ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు నడిపిస్తామని డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌సీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

వేములపల్లి: మండలంలోని మొల్కపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం పులి సరస్వతి, జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, ఎంపీడీఓ అజ్మీరా దేవిక, ఉప సర్పంచ్ రెమడాల కరుణాకర్ పాల్గొన్నారు.